నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
18వ వసంతంలోకి..
www.suryaa.com
EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
మంగళవారం
29 అక్టోబర్ 2024
పేజీలు: 02



# సమయం గడిచిన కొలిక్కిరాని ఇందిరమ్మ కమిటీలు

ఇందిరమ్మ ఇల్లు కట్టిస్తానన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తొలిదశలోనే ఎదురుదెబ్బ.. ఇందిరమ్మ కమిటీలు కూడా ఏర్పాటు చేయలేక తలలు పట్టుకున్న నేతలు. ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేసేందుకు కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే లబ్ధిదారుల ఎంపిక నిమిత్తం పల్లెలు, పట్టణాల్లో ఇందిరమ్మ కమిటీల్లోకి సభ్యులను తీసుకోవాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నెల 11వ తేదీలోపు కమిటీల నియామక ప్రక్రియ పూర్తికావాల్సి ఉన్నా.. అధికార పార్టీ నేతల మధ్య సమన్వయ లోపం, అధికారుల అవగాహన రాహిత్యంతో ఇప్పటికీ కమిటీలు ప్రతిపాదన దశలోనే ఉన్నాయి. ప్రభుత్వం ఓ వైపు దీపావళి నుంచి ఇందిరమ్మ పథకం కింద ఎంపికైన లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలకు ముగ్గుపోయాలని నిర్ణయించగా.. జిల్లాల్లో మాత్రం ఈ ప్రక్రియ ప్రారంభం జాప్యం జరిగే అవకాశాలున్నాయి.




# మళ్ళీ నష్టాల బాట పట్టిన స్టాక్ మార్కెట్లు

సోమవారం లాభాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు.. మంగళవారం ఉదయం మళ్ళీ నష్టాల బాట పట్టాయి. ఉదయం 9:30 గంటలకు సెన్సెక్స్ 243.95 పాయింట్ల నష్టంతో 79,761.09 వద్ద, సెన్సెక్స్ 56.85 పాయింట్ల నష్టంతో 24,282.45 పాయింట్ల వద్ద సాగుతున్నాయి. నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్, ఐసీఐసీఐ బ్యాంక్, లార్సెన్ & టూబ్రో, గ్రాసిమ్ ఇండస్ట్రీస్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెదలైనవి టాప్ గెయినర్స్ జాబితాలో చేరగా.. భారతి ఎయిర్‌టెల్, టాటా మోటార్స్, హీరోమోటోకార్ప్, శ్రీరామ్ ఫైనాన్స్, జేఎస్‌డబ్ల్యు స్టీల్ వంటి కంపెనీలు నష్టాలను చవి చూశాయి.



# ఆన్‌లైన్ గేమ్స్‌కి బలైన బీటెక్ విద్యార్థి

వర్ధన్నపేట మండలం కడారిగూడెం గ్రామానికి చెందిన బత్తిని గణేశ్(20) హైదరాబాద్‌లోని ఘట్‌కేసర్‌లో ఓ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. గణేశ్ తండ్రి పదేళ్ల క్రితమే చనిపోగా, తల్లి ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తూ కుమారుడిని బీటెక్ చదివిస్తుంది.. అయితే ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసైన గణేశ్ తన ఫ్రెండ్స్ దగ్గర భారీగా అప్పులు చేశాడు. ఇటీవల దసరా పండుగకు ఇంటికి వెళ్ళిన గణేష్ కాలేజీలో ఫీజు కట్టేందుకు రూ.80 వేలు తీసుకొని, వాటిని కూడా ఆన్‌లైన్ గేమ్‌లో పోగొట్టుకున్నాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన గణేశ్ సోమవారం కాలేజీ సమీపంలో పురుగుల మందు తాగి చనిపోయాడు.. భర్త లేకపోయినా కష్టపడి కొడుకును చదివిస్తే, తాను చనిపోయాడని గణేష్ తల్లి భోరున విలపించింది.



# కేరళ సీఎంకు తప్పిన ప్రమాదం..

కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు తృటిలో పెను ప్రమాదం తప్పింది. ఆయన కాన్వాయ్‌లోని పలు వాహనాలు ఒకదానికొకటి ఢీ కొన్నాయి. ఈ ఘటన తిరువనంతపురంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. ప్రమాదంలో సీఎం సహా సిబ్బందికి ఎలాంటి గాయాలూ కాలేదు. వాహనాలకు మాత్రం స్వల్ప నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది.సీఎం విజయన్ సోమవారం సాయంత్రం కొట్టాయం సందర్శనకు వెళ్లి తిరిగి రాజధానికి వస్తున్న సమయంలో వామనాపురం వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మహిళ సడెన్‌గా రైట్ తీసుకోబోతుండగా.. అప్రమత్తమైన కాన్వాయ్‌లోని ముందు వెళ్తున్న పైలట్ వాహనం అకస్మాత్తుగా ఆగిపోయింది. దీంతో వెనుక ఉన్న సీఎం కారు, అంబులెన్స్ సహా ఆరు ఎస్కార్ట్ వాహనాలు ఒకదానికొకటి ఢీ కొన్నాయి. ఈ ఘటనలో సీఎం వాహనానికి స్వల్పంగా నష్టం వాటిల్లినట్లు సమాచారం. అయితే, అదృష్టవశాత్తూ ఈ ప్రమాదంలో సీఎం, ఇతర సిబ్బందికి ఎలాంటి గాయాలూ కాలేదు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది.



# రచ్చ గెలిచి ఇంట గెలిచానని చిరంజీవి భావోద్వేగం

సినీరంగంలో తాను రచ్చ గెలిచి ఇంట గెలిచానని వ్యాఖ్యానించారు అగ్ర నటుడు చిరంజీవి. ఏఎన్నార్ నేషనల్ అవార్డును అందుకోవడంతో తాను ఇంట గెలిచానని గర్వంగా ఉందన్నారు. వజ్రోత్సవాల సందర్భంగా తనకు జరిగిన చేదు అనుభవాన్ని గుర్తుచేసుకొని చిరంజీవి భావోద్వేగానికి గురయ్యారు. సోమవారం హైదరాబాద్ అన్నపూర్ణ స్టూడియోలో నిర్వహించిన వేడుకలో 'అక్కినేని నాగేశ్వరరావు జాతీయ అవార్డు'ను ఆయన అందుకున్నారు. 2024 సంవత్సరానికిగానూ ఈ అవార్డును ప్రదానం చేశారు. అమితాబ్‌బచ్చన్ చేతుల మీదుగా చిరంజీవి పురస్కారాన్ని స్వీకరించారు.

**చిరంజీవి ఏది అడిగినా ఇవ్వడానికి సిద్ధంగా ఉంటారు: అమితాబ్‌బచ్చన్**

చిరంజీవి, నాగార్జున, నాగ్‌అశ్విన్ వంటి వారు నన్ను తెలుగు సినిమాల్లో భాగం చేశారు. తెలుగు ఇండస్ట్రీలో నేను కూడా ఓ సభ్యుడినేనని గర్వంగా చెప్పకుంటా. తెలుగు చిత్రసీమలో నన్నూ ఓ భాగంగా పరిగణించండి. ఇండియన్ సినిమాకు నాగేశ్వరరావుగారు చేసిన సేవలు అనితరసాధ్యం. ఇక చిరంజీవి నేను ఎప్పుడు ఏది అడిగినా ఇవ్వడానికి సిద్ధంగా ఉంటారు. చిరంజీవి ప్రేమ, అభిమానానికి ధన్యవాదాలు.

**రచ్చ గెలిచి ఇంట గెలిచాను: చిరంజీవి**

అమితాబ్‌బచ్చన్ నాకు గురువు, స్ఫూర్తిప్రదాత. నాకు ఏ అవార్డు వచ్చినా తొలుత ఆయన నుంచే శుభాకాంక్షలు అందుతాయి. పద్మభూషణ్ అవార్డు వచ్చినప్పుడు జరిగిన సన్మాన కార్యక్రమంలో అమితాబ్‌గారు 'చిరంజీవి కింగ్ ఆఫ్ ఇండియన్ సినిమా' అని చెప్పడం నేను ఇప్పటికీ మర్చిపోలేను. ఆయన మాటలు నాకు స్ఫూర్తినిచ్చాయి. అమితాబ్‌బచ్చన్‌గారితో గడిపిన ప్రతి క్షణం విలువైనది. ఇండియన్ సినిమాకు బాద్‌షా, షెహన్‌షా అయిన అమితాబ్ నుంచి ఈ అవార్డు స్వీకరించడం గర్వంగా ఉంది. తెలుగులో ఇంట గెలిచి రచ్చ గెలవాలి అనే ఓ నానుడి ఉంది. నా విషయంలో రచ్చ గెలిచి ఇంట గెలిచానని అనిపిస్తోంది. నేను ఇంట గెలిచే అవకాశం తెలుగు సినిమా వజ్రోత్సవాల సమయంలో వచ్చింది. నాకు అప్పుడు లెజెండరీ పురస్కారం ప్రదానం చేశారు. అప్పుడు ఎంతో ఆనందపడి ధన్యుణ్ణి అనుకున్నా. కానీ కొన్ని ప్రతికూల పరిస్థితుల వల్ల, కొందరు వ్యక్తులు హర్షించని కారణంగా ఆ పురస్కారాన్ని తీసుకోవడం సముచితం అనిపించలేదు. అందుకే ఆ రోజు అవార్డుని ఓ క్యాప్సుల్ బాక్స్‌లో పడేసి నాకు అర్హత ఎప్పుడు వస్తుందో అప్పుడే తీసుకుంటానని చెప్పాను. ఆ రోజు నేను ఇంట గెలవలేదు. ఈ రోజు ది గ్రేట్ ఏఎన్నార్ అవార్డును ది గ్రేట్ అమితాబ్‌బచ్చన్‌గారి చేతుల మీదుగా అందుకున్నా. ఇప్పుడు నేను ఇంట గెలిచాను.. రచ్చగెలిచాను అనిపిస్తోంది. ఈ పురస్కార ప్రదానం గురించి చెప్పడానికి నాగార్జున, వెంకట్ ఇంటికి వచ్చినప్పుడు చాలా ఆనందించాను. నాకు పద్మభూషణ్, పద్మవిభూషణ్, గిన్నిస్‌బుక్‌లో స్థానం వచ్చినా ఈ అవార్డు విషయంలో నా భావోద్వేగం వేరుగా ఉంది. నావాళ్లు నన్ను గుర్తించి అవార్డు ఇస్తుండటం నాకు గొప్ప విషయంగా అనిపించింది. ఇది నాకు అన్ని పురస్కారాలకు మించిన ప్రత్యేకమైన అవార్డు అని నాగార్జునతో చెప్పాను. ఈ వేడుకలో మా అమ్మని ముందు సీటులో కూర్చొబెట్టడానికి ప్రధాన కారణం..అమ్మ నాగేశ్వరరావుగారికి వీరాభిమాని. అక్కినేని నాగేశ్వరరావుగారితో కలిసి 'మెకానిక్ అల్లుడు' చిత్రంలో నటించినప్పుడు ఎన్నో మంచి విషయాలు నేర్చుకున్నా. సెట్‌లో ఆయన్ని చూస్తే నడిచే ఎన్‌సైక్లోపీడియా అనిపించేది. ఆయన నాకు పితృసమానులు. ఈ విషయం ఎక్కడా చెప్పే అవకాశం రాలేదు. అందుకే ఇక్కడ చెబుతున్నా. దేవానంద్, లతా మంగేష్కర్, అమితాబ్ బచ్చన్, కె.బాలచందర్ వంటి లెజెండ్స్‌కు దక్కిన ఈ పురస్కారం నాకు దక్కడ పూర్వ జన్మ సుకృతం. ఈ అవార్డు నా జీవితానికి పరిపూర్ణతనిచ్చింది. ఈ రోజుని జీవితాంతం గుర్తుంచుకుంటాను. నాగార్జున నాకు భగవంతుడు ఇచ్చిన అద్భుతమైన స్నేహితుడు. నాకు ఆహారం, ఆరోగ్యం విషయంలో ఎప్పుడూ సలహాలిస్తుంటాడు. ఆయన ఏం చెప్పినా ఫాలో అయిపోతుంటాను. అక్కినేని కుటుంబం మొత్తం మా కుటుంబ సభ్యుల్లాంటివారే. వారు చూపించే ప్రేమను నేను జీవితాంతం పదిలపరచుకుంటాను.

**ఆ మాటలు నిజం: నాగార్జున**

'భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచే గొప్ప వ్యక్తులను గౌరవించుకోవడమే ఏఎన్నార్ అవార్డు ముఖ్య ఉద్దేశం. ఈ రోజు ఈ వేదికపై అలాంటి గొప్ప వ్యక్తులు ఇద్దరు ఉన్నారు. వారే ఇండియన్ సినిమా బిగ్‌బీ అమితాబ్ బచ్చన్, మెగాస్టార్ చిరంజీవి. ఈ ఏడాది ఏఎన్నార్ పురస్కారాన్ని నా మిత్రుడు పద్మవిభూషణ్ చిరంజీవికి అందిస్తున్నందుకు మా కుటుంబసభ్యులంతా గర్విస్తున్నాం.. ఆనందిస్తున్నాం. దాన్ని మనందరం ఎంతగానో ఆరాధించే పద్మవిభూషణ్ అమితాబ్‌బచ్చన్‌గారు ప్రజెంట్ చేయడం ఈ వేడుకకు ఇంకా ప్రత్యేకం. రీసెంట్‌గా 'కల్కి' చూశాను. అమితాబ్‌జీ అశ్వత్థామగా చూసినప్పుడు మా ఒరిజినల్ మాస్ హీరో ఈజ్ బ్యాక్ అనిపించింది. ఇదే విషయం ఆయనకు కాల్ చేసి చెప్పాను. మాలాంటివారందరికీ ఆయనే ఇన్‌స్పిరేషన్. ఇక మిత్రుడు చిరంజీవితో నాకెన్నో బ్యూటిఫుల్ మెమరీస్ ఉన్నాయి. రికార్డులు బ్రేక్ చేయడం ఆయనకు అలవాటు. ఇటీవలే గిన్నిస్‌బుక్‌లోకి కూడా ఎక్కేశారు. నేను సినిమాల్లోకి వద్దామనుకుంటున్న రోజుల్లో చిరంజీవి షూటింగ్ మా స్టూడియో జరుగుతుంటే 'ఒకసారి వెళ్లి చూసి నేర్చుకో..' అని నాన్నగారు చెప్పారు. వెళ్లి చూశాను. ఏదో వాన పాట షూటింగ్ జరుగుతుంది. చిరంజీవి, రాధ డ్యాన్స్ చేస్తున్నారు. ఆ డ్యాన్స్, ఆయన గ్రేస్ చూశాక నాకు భయమేసింది. సినిమాలు మనకు కరెక్ట్ కాదని, మరో దారి చూసుకుందాం అనుకున్నా. నటుడిగానే కాదు, ఎన్నో సేవాకార్యక్రమాలతో సంఘ సేవకునిగా కూడా పదుగురికి ఆదర్శంగా నిలిచారు చిరంజీవి. ఆయన్ను అమితాబ్ 'కింగ్ ఆఫ్ ఇండియన్ సినిమా'గా అభివర్ణించారు. అది ముమ్మాటికి నిజం. అలాంటి గొప్ప వ్యక్తికి నాన్నగారి అవార్డు అందించడం ఆనందంగా ఉంది' అన్నారు నాగార్జున. ఇంకా ఈ కార్యక్రమంలో చిరంజీవి తల్లిగారైన అంజనాదేవి, టి.సుబ్బిరామిరెడ్డి, వెంకటేశ్, ఎం.ఎం.కీరవాణి, రామ్‌చరణ్, బ్రహ్మానందం తదితరులతోపాటు అక్కినేని కుటుంబసభ్యులందరూ పాల్గొన్నారు.



# విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనలు తిరస్కరణ.. తెలంగాణ ప్రజల విజయం

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదించిన విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనలను విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్సీ) తిరస్కరించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్ చైర్మన్ శ్రీ రంగారావు, సభ్యులు మనోహర్ రాజు, కృష్ణయ్యకు తెలంగాణ ప్రజల తరపున బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు కేటీఆర్ ట్వీట్ చేశారు. విద్యుత్ చార్జీల పేరిట రూ. 18,500 కోట్ల అదనపు భారం ప్రజలపై మోపడాన్ని హైదరాబాద్, నిజామాబాద్, సిరిసిల్లలో నిర్వహించిన మూడు బహిరంగ విచారణలలో తాము తీవ్రంగా వ్యతిరేకించామని కేటీఆర్ తెలిపారు. ఇది తెలంగాణ ప్రజల విజయం అని కేటీఆర్ పేర్కొన్నారు.



# యాకుత్‌పురాలో బాణసంచా పేలుడు.. దంపతులు మృతి

హైదరాబాద్ నగరంలోని యాకుత్‌పురాలో విషాదం నెలకొంది. ఇంట్లో బాణసంచా పేలి ఇద్దరు దంపతులు ప్రాణాలు కోల్పోయారు. వీరి కుమార్తెకు తీవ్ర గాయాలు కాగా, చికిత్స నిమిత్తం మలక్‌పేటలోని ఓ ఆస్పత్రికి తరలించారు. కూతురి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు సమాచారం. బాణసంచా పేలడంతో మంటలు చెలరేగాయి. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే ఈ దంపతులిద్దరూ దీపావళి పండుగ నేపథ్యంలో స్థానికంగా పటాకుల దుకాణం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఇంట్లో పటాకుల నిల్వలను ఉంచారు. రాత్రి ఇంట్లో పిండి వంటలు చేస్తుండగా.. నిప్పు రవ్వలు ఎగిరిపడి, బాణసంచాకు అంటుకున్నాయి. దీంతో మంటలు ఎగిసిపడడంతో, అగ్నికీలల్లో చిక్కుకుని దంపతులు ప్రాణాలు కోల్పోయారు.

# దీపావళి ఎఫెక్ట్.. పూల ధరలకు రెక్కలు

దీపావళి పండుగ పూల రైతులకు కాసుల వర్షం కురిపిస్తోంది.రెండు రోజులుగా పూల ధరలకు రెక్కలు వచ్చాయి. సోమవారం వి.కోట పూల మార్కెట్‌లో కిలో బంతి పూలు గరిష్టంగా రూ. 40 వరకు పలకగా, కిలో చామంతి పూలు అత్యధికంగా రూ. 150 వరకు పలికాయి. బటన్ రోస్ కిలో రూ. 200 పలికింది. వి.కోటలో పూల వ్యాపారుల మధ్య పోటీ తలెత్తడంతో ధరలు ఒక్కసారిగా రెట్టింపయ్యాయి. వారం రోజుల క్రితం బంతి పూలు 30 కిలోల బస్తా రూ. 50 నుంచి వంద వరకు పలికేది. చామంతి కిలో రూ. 20 నుంచి 30 వరకు పలికేది.బటన్ రోస్ కిలో రూ. 80 వరకు మాత్రమే పలకగా, సోమవారానికి రెట్టింపు ధరలు పలకడంతో పూల రైతుల్లో ఆనందం వ్యక్తమైంది. వి.కోట ప్రాంతంలో పండించే పూల నాణ్యత బాగుండడంతో పుణ్యక్షేత్రాల్లో మంచి గిరాకీ ఉంది. వి.కోట నుంచి తిరుపతి, హైదరాబాదు, శ్రీశైలం, విజయవాడ, రాజమండ్రి, మధురై, చెన్నై, బెంగళూరు, కోల్‌కత్తా తదితర ప్రాంతాల్లోని పుణ్య క్షేత్రాలకు పూలను ఎగుమతి చేస్తారు. దీపావళి సీజన్ కావడంతో పూలకు మరింత డిమాండు పెరిగింది. వారం రోజుల ముందు కురిసిన వర్షాల వల్ల పూల తోటలు పూర్తిగా దెబ్బతిని దిగుబడులు తగ్గిపోయాయి. వ్యాపారుల మధ్య కొనుగోళ్ళకు పోటీ రావడంతో పూల ధరలు అమాంతం పెరిగాయి. రెండు రోజుల్లో ఈ ధరలు మరింత పెరిగే అవకాశముందని వ్యాపారులంటున్నారు. రెండు వారాల క్రితం వర్షాలతో పూలకు సరైన ధరలు లేకపోవడంతో కోతకోసిన పూలను రైతులు మార్కెట్‌కు తరలించినా అక్కడ కొనేవారు లేక రోడ్డు పక్కన పడేశారు. అదే నేడు పూల తోటల వద్దకే వ్యాపారులు తోటలను తమకే ఇవ్వాలంటూ క్యూకడుతున్నారని రైతులు చెబుతున్నారు.



సూర్య
www.suryaa.com
EVENING EDITION 4 PM



### జగన్‌కు 151 ఎలా వచ్చాయనుకున్నారు?

# గుట్టు విప్పిన అనిల్

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డికి చెందిన సరస్వతి పవర్ ఇండస్ట్రీస్ వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో దుమారం రేపుతోంది. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధినేత్రి వైఎస్ షర్మిల వ్యవహారాన్ని వైఎస్ఆర్సీపీ నాయకులు తప్పుపడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో కలిసి జగన్‌ను జైలుకు పంపించేలా కుట్ర పన్నిందంటూ ఆరోపిస్తోన్నారు. దీనిపై తాజాగా షర్మిల భర్త, ప్రముఖ ఎవాంజలిస్ట్ బ్రదర్ అనిల్ కుమార్ మాట్లాడారు. వైఎస్ఆర్సీపీ నాయకులు చేస్తోన్న ఆరోపణలను తిప్పికొట్టారు. జగన్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు. ఆస్తుల కోసం జగన్ తన తల్లి, చెల్లినీ లెక్క చేయట్లేదంటూ మండిపడ్డారు. ఆస్తుల కోసం ఎందాకైనా వెళ్తాడని, వారిద్దరిపై పిటీషన్లు వేయడం దీనికి ఉదాహరణ అని వ్యాఖ్యానించారు. ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అనేక అంశాలను ప్రస్తావించారు. తెలంగాణలో షర్మిల వైఎస్ఆర్టీపీ ఎందుకు పెట్టాల్సి వచ్చిందనే విషయాన్నీ వివరించారు. 2019లో జగన్ ముఖ్యమంత్రి అయ్యాక తెలంగాణలో పార్టీ పెట్టాలని, రాజకీయంగా ఎంతో లబ్ది కలుగుతుందని షర్మిలకు రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ సూచించారని, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు భయపడి జగన్ దీనికి నిరాకరించారని చెప్పారు. తన ఆస్తులన్నీ హైదరాబాద్‌లోనే ఉండటం వల్ల ఇబ్బందులు వస్తాయని షర్మిలతో పార్టీ పెట్టించడానికి జగన్ అడ్డుకున్నారని బ్రదర్ అనిల్ కుమార్ చెప్పారు. తీరా ఆమె ధైర్యం చేసి తెలంగాణలో వైఎస్ఆర్టీపీ పెట్టినప్పుడు సాక్షిలో అడ్వర్టయిజ్‌మెంట్ కూడా ఇవ్వడానికి జగన్ అంగీకరించలేదని విమర్శించారు. ఈ విషయంలో



స్వయంగా వైఎస్ విజయమ్మ జోక్యం చేసుకున్నారని, అడ్వర్టయిజ్‌మెంట్‌కు ఖర్చులు భరిస్తామని చెప్పినా ఒప్పుకోలేదని పేర్కొన్నారు. ఏపీలో అధికారంలోకి రావడానికి తమను అన్ని రకాలుగా వినియోగించుకున్నాడని, ముఖ్యమంత్రి అయిన తరువాత జగన్ తమను పక్కన పెట్టాడని మండిపడ్డారు. తమ అవసరం తీరిన తరువాత పక్కన పెట్టేశాడని, దగ్గరికి కూడా రానివ్వలేదని అనిల్ ఆరోపించారు. అప్పుడే జగన్ నిజ స్వరూపం బయటపడిందని చెప్పారు. జగన్ స్వార్థపరుడు అనడానికి ఇంతకంటే నిదర్శనం లేదని, ఆ స్వార్థంతోనే ఇప్పుడు కుటుంబ సభ్యులపై పిటీషన్లు వేశారని అన్నారు. 2019 నాటి ఎన్నికల్లో వైఎస్ఆర్సీపీకి 151 సీట్లు తన వల్లే వచ్చాయని బ్రదర్ అనిల్ అన్నారు. అది- తన నంబర్‌గా అభివర్ణించారు. తన మొబైల్, కారు నంబర్ అన్నీ కూడా 151తోనే ఉంటాయని వివరించారు. జీసస్ క్రైస్ట్ అని లెక్కబెడితే 151 అనే అంకెలు వస్తాయని, దేవుడు ఆ నంబర్‌ను తనకు మాత్రమే ఇచ్చాడని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో దేవుడి రాజ్యాన్ని నిర్మించడానికి తనకు అదృష్టంగా 151 సంఖ్య లభించిందని, అదే నంబర్‌తో 2019 నాటి ఎన్నికల్లో వైఎస్ఆర్సీపీకి అసెంబ్లీ సీట్లు లభించాయని గుర్తు చేశారు. తాను చేసిన ప్రార్థనలను దేవుడు ఆలకించడానికి ఈ ఘటన ఓ ఉదాహరణ అని చెప్పారు.

### కేరళ ఉత్సవంలో పేలిన బాణాసంచా..

## 150 మందికి గాయాలు

కేరళలోని అంజుతాంబలం వీరేర్కావు ఆలయంలో సోమవారం రాత్రి బాణాసంచా పేల్చిన సమయంలో అగ్నిప్రమాదం జరిగింది. ఆ ప్రమాదంలో సుమారు 150 మంది గాయపడ్డారు. గాయపడ్డవారిని కాసర్‌గడ్, కన్నూర్, మంగళూరు ఆస్పత్రులకు తీసుకెళ్లారు. నీలేశ్వరంలోని వీరేర్కావు ఆలయం వద్ద నిల్వ ఉంచిన బాణాసంచా వల్ల ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. సోమవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. కాసర్‌గడ్ జిల్లాలో జరిగిన ఈ ప్రమాదంలో ప్రస్తుతం 8 మంది పరిస్థితి విషమంగా ఉన్నది. తీయం ఉత్సవంలో భాగంగా జరుగుతున్న సంబరాల వేళ విషాద ఘటన చోటుచేసుకున్నది.

### హాట్‌గా

# ఆషికా

నాగార్జున 'నాసామిరంగ'తో తెలుగు ప్రేక్షకుల మనసుల్ని దోచేసింది కన్నడ కస్తూరి ఆషికా రంగనాథ్. అయితే.. అవకాశాలు మాత్రం ఈ ముద్దుగుమ్మకు అనుకున్న స్థాయిలో రాలేదనే చెప్పాలి. ప్రస్తుతానికి తెలుగులో చిరంజీవి 'విశ్వంభర'లో కీలక పాత్ర పోషిస్తున్నదని సమాచారం. ఇదిలావుంటే.. ఇతర భాషల్లో అషికాకు అవకాశాలు బాగానే ఉన్నాయి. కన్నడలో రెండుమూడు సినిమాలు చేస్తున్న ఈ అందాలభామ.. తాజాగా తమిళంలో ఓ భారీ ఆఫర్‌ని దక్కించుకుంది. ఆ సినిమానే 'సర్దార్ 2'. కార్తీ కథానాయకుడిగా రూపొందిన 'సర్దార్' తమిళనాట భారీ విజయాన్ని అందుకుంది. ఇప్పుడు ఆ సినిమాకు సీక్వెల్‌గా 'సర్దార్ 2'ను తెరకెక్కిస్తున్నారు దర్శకుడు పీఎస్ మిత్రన్. ఇందులో హీరోయిన్‌గా నటించే ఛాన్స్‌ను కొట్టేసింది అషికా రంగనాథ్. అంతేకాక, సిద్ధార్థ్ హీరోగా నటిస్తున్న 'మిస్ యు' సినిమాలో కూడా నటిస్తున్నది అషికా. ఇవి విజయాలు సాధిస్తే కోలీవుడ్‌లో ఈ అందాలభామకు మంచిరోజులొచ్చినట్టే.

## కృష్ణుడిగా మహేష్



దర్శకధీరుడు రాజమౌళి — మహేష్ బాబు సినిమా ఎప్పుడు స్టార్ట్ అవుతుంది ? అంటూ మహేష్ ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ మూవీ పై చాలా రూమర్స్ వినిపిస్తున్నాయి. ఐతే, తాజాగా మరో కొత్త సినిమాకి సంబంధించి మహేష్ పాత్ర పై ఓ క్రేజీ గాసిప్ బాగా వైరల్ అయింది. మహేష్ బాబు మేనల్లుడు అశోక్ గల్లా 'దేవకి నందన వాసుదేవ' అనే సినిమా చేస్తున్నాడు. ఐతే, ఈ సినిమాలో మహేష్, శ్రీకృష్ణుడి పాత్రలో కొన్ని క్షణాల పాటు కనిపిస్తాడని పుకార్లు షికార్లు చేశాయి. కానీ, ఈ వార్తకు సంబంధించి లేటెస్ట్ అప్ డేట్ ప్రకారం.. మహేష్ 'దేవకి నందన వాసుదేవ' సినిమాలో ఎలాంటి పాత్రలో నటించడం లేదు. శ్రీకృష్ణుడి పాత్రలో కొన్ని క్షణాల పాటు కనిపిస్తాడని వచ్చిన పుకార్లు పూర్తిగా అవాస్తవం. అలాంటి ప్లానింగ్ ఏమి లేదు. ఇక మహేష్ — రాజమౌళి సినిమా విషయానికి వస్తే.. భారీ అంచనాలున్న ఈ ప్రాజెక్టు 2025 లో ప్రారంభం కానుందని తెలుస్తోంది. ప్రస్తుతం స్క్రిప్ట్ పై రాజమౌళి టీమ్ వర్క్ చేస్తోంది.

## సముద్రంలో నేవీ సైనికులకు వైఫై

హైస్పీడ్ ఇంటర్నెట్ కనెక్టివిటీని అందిస్తోన్న స్టార్లింక్ నేవీ సైనికులకు వైఫై సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఎర్ర సముద్రంలో ఒత్తిడిలో ఉండే సైనికులకు ఇది కాస్త ఉపశమనం ఇవ్వనుంది. 'USS ఐసెన్‌హోవర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లో యుద్ధ బృందంలోని నావికులకు ఈ వైఫై కనెక్టివిటీ మనోధైర్యాన్ని ఇచ్చింది' అని నేవీ కెప్టెన్ క్రిస్ చౌదా హిల్ చేసిన వ్యాఖ్యలు వైరలయ్యాయి. దీనికి 'కూల్' అంటూ ఎలాన్ మస్క్ రిప్లై ఇచ్చారు.

## 400 ఎకరాల తాకట్టుకు ప్రభుత్వం సిద్ధం

హైదరాబాద్‌లో ఖరీదైన ప్రాంతాలుగా పేరున్న కోకాపేట, రాయదుర్గంలో ₹20వేల కోట్ల విలువైన 400 ఎకరాలను ప్రైవేటు కంపెనీలకు తాకట్టు పెట్టేందుకు ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. మూలధనం, ఇతర అవసరాల కోసం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ₹10వేల కోట్ల రుణం కోసం పరిశ్రమల మౌలిక సదుపాయాల సంస్థకు గ్యారంటీ ఇచ్చింది. ఇటీవల సీఎం రేవంత్ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ భేటీలో దీనికి ఆమోదం లభించింది.

## ఇళ్ల కనెక్షన్లకు కనీస కరెంట్ ఛార్జీ రద్దు

ఇళ్లలో కరెంట్ అసలేం వాడుకోకపోయినా గతంలో కనీస ఛార్జీ కింద రూ.30 చెల్లించాల్సి వచ్చేది. దాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. ఇది గృహజ్యోతికి అర్హులు కాని వారికి ఉపయోగపడనుంది. గృహేతర/వాణిజ్య పరంగా 50 యూనిట్లలోపు కరెంట్ వాడే వారికి ఫిక్స్‌డ్ ఛార్జీలను కిలోవాట్‌కు రూ.60 నుంచి రూ.30 తగ్గించింది. ఇదే కేటగిరీలో కనీస ఎనర్జీ ఛార్జీలను సింగిల్ ఫేజ్‌కు రూ.65-50కి, త్రీఫేజ్‌కు రూ.200-100కు తగ్గించింది.

## బెల్ట్ షాపులకు చంద్రబాబు వార్నింగ్

రాష్ట్రంలో ఎట్టి పరిస్థితుల్లోనూ బెల్ట్ షాపులను అనుమతించవద్దని సీఎం చంద్రబాబు అన్నారు. బెల్ట్ షాపులకు మద్యం విక్రయించే లిక్కర్ షాపులకు రూ.5 లక్షల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. రెండో సారి నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని చెప్పారు. ఎమ్మార్పీ కంటే ఒక్క రూపాయి ఎక్కువ అమ్మినా ఊరుకోబోమని హెచ్చరించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే మద్యంపై నిఘా పెట్టాలన్నారు.